

భూమికీ ఆకాశానికీ మధ్య చినుకుల సంబంధం తెగిపోయిన రెండో రోజది- వారం రోజులుగా గైరాజరైన సూర్యుడావేళ మబ్బుల్లోంచి బయట పడేందుకు తెగ గింజుకుంటున్నాడు.

పరిసరాలింకా తడితడిగానే వున్నాయి. రోడ్డుమీదా, రోడ్డు పక్కనా బురద గుంటలు ఎంతకీ మానిపోని పుండ్లలా వున్నాయి.

ఉడిపి హోటల్ ఎంట్రెన్స్ చివరి మెట్టుకి ఎడంవైపు మూల చిన్న కన్నంలోంచి చటుక్కున బయట పడిందో చీమ. రెండు క్షణాలు జాగ్రత్తగా పరిసరాలు పరికించి మెల్లగా ముందుకు కదిలింది. అదట్లా నాలుగంగుళాలు వెళ్ళిందో లేదో... కన్నం లోంచి బయటకొచ్చిన మరో చీమ దూకుడుగా వొచ్చి మొదటి చీమను కలుపుకుంది.

ప్రశాంతంగా వున్న ఆ వాతావరణంలో చీమలు రెండూ గోడ పక్కగా చిక్కుముళ్ళుపడ్డ దారాల్లా కదుల్తున్నాయి. కింద నేలంతా వర్షాలకి తడిసి రొచ్చు రొచ్చుగా వుంది. ఎత్తుపల్లాల్నీ... చిన్న చిన్న నీటి మడుగుల్నీ జాగ్రత్తగా గమనిస్తూ కాటుక గీతల్లాంటి కాళ్ళతో ఒక్కో అంగుళమే దాటేసి ముందుకు పోతున్నాయి.

వాటిల్లో మరీ చిన్నగా వున్న చీమ మాటిమాటికీ వేగంగా కదుల్తూ ముందుకెళ్ళి పోతోంది. అలా నడుస్తుంటే దానికెంతో ఉత్సాహంగా వుంది.

వెనకాలే అతి జాగ్రత్తగా పరిసరాలు గమనిస్తూ వొస్తున్న మొదటి చీమ పీలి, దాని దూకుడు నడక్కి కంగారు పడుతోంది.

"ఒసేవ్ చిట్టే...! కొంచెం నెమ్మదిగా.. చుట్టూ చూసుకుంటూ నడువ్. నీ దూకుడుకు దేనికిందనో పడి చస్తావ్" అంటూ హెచ్చరిస్తోంది.

అక్క పిలుపుల్నెంత మాత్రం ఖాతరు చేయట్లేదు చిట్టి చీమ. గంతులేసినట్టు నడుస్తూ ముందుకెళ్తోంది. మధ్య మధ్య అదే వేగంతో వెనక్కి పరిగెత్తుకొచ్చి అక్క చుట్టూ ఓ రౌండ్ కొట్టేసి, మళ్లా రయ్యిన ముందుకు దూసుకుపోతోంది.

"చెప్తుంటే వినిపించుకోవేమిటే ముండా..! అలా పరిగెత్తి నడమంత్రపు చావు తెచ్చుకుంటావేందే..?"

అరిచి అరిచి పీలి చీమకి నోరు పోతోంది. కానీ చిట్టి ఉరుకులు మాత్రం మానలేదు.

చిట్టి చీమను వెంటబెట్టుకొని బయటకు రావటం పీలి కెంతమాత్రం ఇష్టం లేదు. ఇంటి దగ్గర తల్లి కూడా వొద్దంది. కానీ చిట్టి వినిపించుకోలేదు.

వారం రోజులుగా కురిసిన వర్షాలకు చీమల నివాసం

యావత్తూ వరద మయమైపోయింది. తమ కొంపల్ని.. కొంపల్లో సమకూర్చుకున్న కొద్దిగొప్పో ఆహారాన్ని నాది లేపి చీమలన్నీ తలోదిక్కుగా చెల్లాచెదురయ్యాయ్.

ఆ గందరగోళంలో విడిపోయిన నీలిచీమ తండ్రి మళ్ళా కన్పించలేదు. నీళ్ళింకినాక కొంపకు చేరుకుంటే పోగుజేసుకున్నదేమీ మిగల్లేదు.

తల్లీ కూతుళ్ళూ తండ్రి చీమ కోసం ఎంతగానో ఎదుర్చూశారు. కానీ అది తిరిగి రాలేదు. తండ్రి చీమ వరదలో కొట్టుకుపోయిందని కొందరంటే, ఏదో ప్రమాదంలో నలిగి చచ్చిపోయిందని మరి కొందర న్నారు. రాణిచీమ స్థావరంలోకి ఆహారం చేరేస్తుంటే ఏదో గొడవొచ్చి సైనిక చీమలు దాన్ని చంపేశాయనే పుకారు కూడా విన్పించింది.

ఈ ఊహాగానాల మాటెలా వున్నా నీలిచీమకి మాత్రం తండ్రి ఇక తిరిగి రాదని అర్థమైంది.

అలా నాలుగు రోజులు గడిచాయి —

అయిదో రోజు మరి తట్టుకోలేక తిండానికేమైనా తెస్తానని బయటపడింది నీలిచీమ. తండ్రి జ్ఞాపకాలు మనసును కలచివేస్తుంటే పరధ్యానంగా నడుస్తోంది. కళ్ళలోంచి ఉరుకుతున్న అశ్రువుల్ని నొత్తుకోవాలన్న ధ్యాస కూడా లేదు.

— "ఎందుకక్కా ఏడుస్తున్నావ్..? నాన్న గుర్తొచ్చాడా?" అన్న చిట్టి పలకరింపుతో ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది నీలిచీమ. తన కన్నీళ్ళు తుడుస్తున్న చెల్లెలి లేత చేతుల్ని ప్రేమగా ముద్దు పెట్టుకుంది.

"నాన్న ఎక్కడికెళ్ళాడక్కా..?" అడిగింది చిట్టి అక్క పక్కనే నడుస్తూ.

"తెలియదమ్మా! వరదొచ్చి మన కొంపలు కొట్టుకు పోయినప్పుడు పోయాడు. ఇంతవరకూ రాలేదు. ఎక్కడున్నాడో.. ఏమిటో"

"నాన్న నెవరో చంపేశారట కదా..! నిజంగానే నాన్న చచ్చిపోయాడా అక్కా..?"

ఈ ప్రశ్నకు నీలిచీమ వెంటనే జవాబు చెప్పలేక పోయింది. — "నాన్న చచ్చిపోలేదమ్మా.. త్వరలోనే తిరిగొస్తాడు —" అంది.

"సైనిక చీమలంటే ఎవరక్కా?" మళ్ళీ అడిగింది చిట్టి.

"వాటిని రక్షక భటులంటారమ్మా. ఇంకా సిపాయి చీమలని కూడా అంటారు. అవి రాణివాసంలో వుంటాయి—"

"రాణివాసమంటే..?"

"రాణి చీమ స్థావరం"

"అదెక్కడుంది..! మనం ఒకసారి వెళదాం అక్కా" కుతూహలంగా అంది చిట్టిచీమ.

"మనల్నక్కడికి రానివ్వరమ్మా. పనిచేసే పెద్ద చీమలకి మాత్రమే అందులో ప్రవేశం—"

"ఏం పని చెయ్యాలక్కడ..?"

"ఒక్కటేమిటి..? ఇళ్ళు తుడవటం, రోడ్లూడ్వటం దగ్గర్నుంచి రాణివాసంలో ప్రతిపనీ చెయ్యాలి. అన్నిటికన్నా ముఖ్యం సాయంత్రానికల్లా ఎంతో కొంత ఆహారాన్ని సంపాదించి అక్కడ అందజెయ్యాలి—"

"మరి వాళ్ళందరికేం మాయరోగమొచ్చిందక్కా..? వాళ్ళ కూడు వాళ్ళు సంపాదించుకోలేరా..? వాళ్ళకు మనమెందుకు తెచ్చిపెట్టాలి..?"

"ఉష్.. గయ్యాళిముండా..! కాస్త మెల్లగా మాట్లాడు. సిపాయి చీమేదైనా విన్నదంటే మనల్ని బతకనివ్వదు. రాణివాసమంటే ఏమిటనుకున్నావ్..? అది సర్కారు. అక్కడుండే వాళ్ళంతా సర్కారోళ్ళన్న మాట. వాళ్ళు పన్జెయ్యరు. చెయ్యకూడదు. మన నివాసంలో వుండేవన్నీ బానిస చీమలన్నమాట. శ్రామిక చీమలని మనక్కొంచెం సరువుగల పేరుకూడా వున్నదనుకో. ఈ శ్రామిక చీమలన్నీ రాణివాసంలో వుండే సర్కారు చీమలకి ఆహారం తెచ్చిపెట్టాలి. వాళ్ళు దయదల్చి ఏమన్నా ఇస్తే అది మనం తినాలి —"

"ఏమిటీ..! కాలే కడుపులతో మనం చెట్టూ పుట్టా తిరుగుతూ ఆహారాన్ని సంపాదించి వాళ్ళ కివ్వాలా..? వాళ్ళు దయదల్చి మిగిల్చిన ఎంగిలి కూడు మనం తినాలా..? థూ..! మనదేం బతుకులక్కా..?" చీదరించుకుంది చిట్టిచీమ. అక్క మరింకేం ప్రశ్నించనివ్వకుండా విసురుగా ముందుకు నడిచింది.

నీలిచీమ చూపులు హఠాత్తుగా రెండడుగుల దూరంలో వున్న తెల్లటి ఆకారం మీద పడ్డాయి. చిట్టిని హెచ్చరిస్తూ నడకలో వేగాన్ని తగ్గించింది.

చాలా పెద్ద ఆకారమది. నీలిచీమ కళ్ళు పైకెత్తి చూస్తే తప్ప ఆసాంతం కనపడలేదు. చిట్టికూడా దాన్ని గమనించి భయంతో అక్క వెనకాల నక్కింది.

నడక పూర్తిగా ఆపి చుట్టూ పరిశీలనగా చూసింది నీలి. కనుచూపు మేరలో ఏ ప్రమాదమూ లేదు.

ఉన్నట్టుండి ఓ గాలి తెర పెద్దగా వీచింది. పైన గోడమీద కిటికీలోంచి ఎవరో చెత్త బయటకు విసిరేశారు. ఊపిరి బిగపట్టి ఉన్నచోటునే కరుచుకొని వుండిపోయింది నీలిచీమ.

నిముషం తర్వాత కళ్ళు విప్పేసరికి ఇందాక కన్పించిన తెల్లటి ఆకారం నీలికి పూర్తి దగ్గర కొచ్చేసింది. దాన్ని చూసి చిట్టిచీమ భయంతో అరిచి అక్కణ్నుంచి వేగంగా పారిపోయింది.

నీలి గుండెలు జల్లుమన్నాయి. ఎదురుగా కొండ లాంటి ఆ ఆకారమేమిటో అర్థం కాలేదు. రెండు నిముషాలు గడిచినా అది కదలకుండా వున్న చోటునే వుండటంతో ధైర్యాన్ని కూడగట్టుకొని ఆ ఆకారానికి మరింత దగ్గరగా నడిచింది.

దానిచుట్టూ రెండు రౌండ్లు తిరిగింది. ఏదో సరి చయమైన వాసన దాని నాసికాపుటాలకి సోకింది. ఊపిరి గట్టిగా పీల్చి ఆ వాసనేమిటో పసికట్టిన నీలి ఆనందంతో ఎగిరి గంతేసింది.

అదో రొట్టెముక్క..! 'కొండంత' ఆహారం..!

నీలిచీమ ఇంకా దగ్గరగా వెళ్ళి చేతుల్తో తడిమి చూసింది. అవునది రొట్టెనే. మెత్తగా కూడా వుంది.

నీలికి పట్టరాని సంతోషం కల్గింది. వాళ్ళ స్థావరంలోని శ్రామిక చీమలన్నింటికీ కనీసం రెండు రోజులకు సరిపోయే ఆహారమది. అంత ఆహారాన్ని ఒకేచోట కను గొన్నందుకు ఎంతో గర్వపడింది నీలిచీమ.

ఆ సంతోషంలో చెల్లెలు గుర్తొచ్చి చుట్టూ చూసింది. చిట్టి కన్పించలేదు—

ఆ ప్రాంతమంతా కలియతిరిగింది. చెల్లెలు జాడ లేదెక్కడా. నీలిచీమకి కంగారు పుట్టింది. ఓ పక్క పెద్ద మొత్తన ఆహారం దొరికినందుకు సంతోషపడాలో, చెల్లెలు గురించి ఆందోళనపడాలో చప్పన తెలియలేదు.

ఆ ప్రదేశంలో ఇక ఒంటరిగా వుండటానికి భయమేసి తమ స్థావరంకేసి పరుగందుకుంది.

** ** **

ఆ స్థావరంలో నివాసముండేవన్నీ శ్రామిక చీమలే. అందరి సమస్యలూ దాదాపు ఒక్కటే కావటం, పొద్దు గూకులూ ఒకే అధికారం కింద చాకిరీ చెయ్యటం, ఆకలి జబ్బు అక్కడ అందరికీ సర్వ సాధారణం కావటం— ఇవన్నీ ఆ చీమల్ని కల్సికట్టుగా వుండేలా చేశాయి.

నీలిచీమ ఉరుకులు పరుగులతో స్థావరాన్ని చేరుకునే సరికి తమ ఇంటిముందు పెద్ద గుంపు పోగై వుండటం కన్పించింది.

అన్ని చీమలు తమ ఇంటిముందు ఎందుకున్నాయో అర్థంగాక ఆశ్చర్యంతోపాటు భయం కూడా కలిగింది. 'కొంపదీసి.. చిట్టి కేదైనా జరిగిందా..?' ఈ యోచన రాగానే కంగారుగా ముందుకొచ్చింది నీలి.

అల్లంత దూరాన్నే నీలిని పోల్చుకున్నాయి చీమలన్నీ. ఎదురొచ్చి ఆమెను చుట్టుకున్నాయి. —"నీ కడుపు చల్లగుండ..! నీలీ.. నీకేం కాలేదుగద బిడ్డా..! అందరం ఎంత కంగారుపడ్డామో" నీలిచీమను కావలించుకుంటూ అంది తల్లి చీమ.

"కంగారెందుకే అమ్మా..?"

"అదేమిటమ్మాయ్.. అలా అడుగుతావ్..? ఏదో భూతం నీమీద దాడి చేసిందని చెప్పింది చిట్టి. ఆ భూతాన్ని చూసి భయపడి నీ చెల్లెలు ఇంటికి పరిగెత్తు కొచ్చింది. దాని మాటలు విన్నాక మాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఇక నీ అమ్మనైతే ఒకటే ఏడుపు—

గుంపులో వయసుడిగిన ఓ చీమ అంది.

అంతా విని బిగ్గరగా నవ్వింది నీలి. చీమలన్నీ తనవంక విచిత్రంగా చూడటంతో నవ్వునాపి అక్కడ జరిగింది వివరించింది.

"నువ్వు చెప్తున్నది నిజమేనటే నీలీ..? నువు చూపింది నిజంగా రొట్టేనా..?" అనుమానంగా చూస్తూ అడిగిందో ముసలిచీమ.

"అమ్మతోడు తాతా..! నిజంగానే అది కొండంత రొట్టె. మన గూడెమంతటికీ రెండు రోజుల దాకా తిండి దిగులక్కర్లేదు. నామాట విని అంతా అక్కడికి పదండి త్వరగా. పెద్దజాతి చీమలో.. సిపాయి చీమలో చూశాయంటే మన నోట్లో దుమ్ము పడ్తుంది—" నీలిచీమ అందర్నీ తొందరపెట్టింది.

చీమలన్నీ హర్షధ్వానాలు చేశాయి. కొన్ని చీమలైతే నీలిని ప్రేమతో ముద్దు పెట్టుకున్నాయి.

క్షణాల మీద ఈ వార్త స్థావరమంతా పాకిపోయింది. చిన్నా పెద్దా చీమలన్నీ కట్టగట్టుకొని ముందుక్కదిలాయి. నీలి ముందు దారి చూపిస్తుంటే చీమలు చాలా వేగంగా నడిచి ఉడిపి హోటల్ వెనుక చెత్తకుప్ప దగ్గరకు చేరుకున్నాయి.

నీలిచీమ చూపిన ఆహారం ఇంకా అక్కడే వుంది. శ్రామిక చీమలన్నీ అభినందిస్తున్నట్టుగా చూశాయి నీలివంక.

ఆ ఆహారపు కొండను తరలించడానికి క్షణాల మీద వ్యూహం తయారైంది. రొట్టెముక్క చుట్టూ చేరి చీమలన్నీ దాన్ని కరిచి పట్టుకున్నాయి. మరో క్షణంలో వాటి మహాప్రస్థానం మొదలయ్యేదే.

ఇంతలో —

"ఆగండి..! ఎవ్వరూ కదలడానికి వీల్లేదు. ఆ ఆహారం మాది" అనే పిడుగులాంటి స్వరం వినిపించింది.

శ్రామిక చీమలు ఉలిక్కి పడుతూ అటు చూశాయి. దాదాపు వందకు పైగా వున్న గండు చీమల దండు దూకుడుగా ముందుకొచ్చి చూస్తుండగానే రొట్టె చుట్టూ వలయాకారంగా నిలబడ్డాయి. వాటి వాలకం చూస్తుంటే యుద్ధానికి సిద్ధపడే వొచ్చినట్టున్నాయి.

"ఈ ఆహారం మాది. అడ్డు తొలగండి-" అన్నాడు గండుచీమల నాయకుడు బిగ్గరగా.

ఆ గద్దింపుకు రొట్టెను కరిచి పట్టుకున్న చీమలన్నీ దాన్నొదిలేసి నోట మాట రానట్టుండిపోయాయి. అందరికన్నా ముందుగా నీలిచీమ తేరుకుంది. రెండడుగులు ముందుకు వేసి, "ఈ రొట్టెను ముందుగా కనుగొన్నది నేను. ఇది చూడగానే మా స్థావరానికెళ్ళి మావాళ్ళను పిల్చుకొచ్చాను. ఈ ఆహారం మాదే" అంది.

"ఏంటిదే పోరీ..! ఏమో బాగా మాట్లాడుతున్నవ్..? నువు జెప్పే కట్టుకథలు ఇక్కడెవరూ నమ్మరు. నీకన్నా కొద్ది నిముషాలు ముందే ఈ రొట్టెను మేము చూశాం. మర్యాదగా పక్కకి తొలుగుతారా.. లేదా..?" అందా గండుచీమ మళ్లీ గుడ్లురుముతూ.

"కాదు- ముందు నేనే చూశాను. దీన్ని నేను చూసినప్పుడీ ప్రదేశంలో ఎవ్వరూ లేరు. ఇది మాదే. మా తిండి లాక్కోవడం అన్యాయం—"

"అవును అన్యాయం..!" అన్నాయి మిగతా చీమలు నీలికి జతగా.

"నోరుముయ్యండి..! మీరా నాకు న్యాయం చెప్పేది..?" గట్టిగా అరిచింది గండుచీమ. "ఈ ఆహారం మాది. మేం ఏది చెప్పితే అదే న్యాయం. బలమున్నోడు ఎక్కడుంటే అక్కడే వుంటుంది న్యాయం. ఈ ఆహారాన్ని ఎవరు ముందు చూశారనేది నాకు అనవసరం. ఇదిప్పుడు మేం తీసుకుపోతాం. అదే న్యాయం. దీనికి మీ దిక్కున్న చోట చెప్పుకొండి, పదనండిక్కణ్నుంచి—"

నీలిచీమకేం చెయ్యాలో తోచలేదు. తనవాళ్ళకేసి తల తిప్పింది. అంతా దీనంగా చూస్తున్నారు. చివరి ప్రయత్నంగా మరో రెండడుగులు ముందుకేసి గండు చీమల నాయకుణ్ని ప్రాధేయపడింది.

—"బాబుగారూ..! ఈ రొట్టె నిజంగా మాదే. మేమే ముందు చూశాం. దయచేసి ఒక్కసారి మావాళ్ళ కడుపులు చూడండి ఎట్లా లోతుకు పోయాయో. ఆ మొహాలు చూడండి ఎంతలా వాడిపోయాయో. వరదొచ్చి మా గూడెమంతా కొట్టుకుపోయింది. అయిదు రోజుల్నుంచి అందరికీ పస్తులే. మామీద కనికరించండి..! ఇప్పుడీ రొట్టె మీరు లాక్కుపోతే మేమంతా ఆకలికి మాడి చచ్చిపోతాం—"

"ఏమిటీ.. చచ్చిపోతారా..? భేషుగ్గా చావండి!" వికటంగా నవ్వింది గండుచీమ. "ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఊ.. చూస్తారేమిటి.. లాక్కుపదండి ఆహారాన్ని" అంటూ తన వాళ్ళకి ఆదేశాలిచ్చింది.

నిస్సహాయంగా తల వంకించింది నీలిచీమ. నోటి ముందు కొచ్చిన కూడు చిటికెలో తన్నుకుపోతున్న గండుచీమల్ని చూసి కడుపు దహించుకుపోయింది శ్రామిక చీమలకి.

అవి తమకన్నా బలవంతులైతే కావొచ్చు..! పెద్ద జాతివైతే కావొచ్చు..! కానీ ఆకలికి జాతుల తేడా లేదు. ఆకలితో అలమటించే తమ కడుపుల మీద కొడుతుంటే చూస్తూ ఊరుకోవాల్సిందేనా..?

ఈ అన్యాయం ఎందుకు జరగనివ్వాలి..?

ఆకలికి ఆగ్రహం తోడై శ్రామిక చీమల చూపులు ఎర్రబడ్డాయి. ఏదో నిశ్చయంతో వాటి చేతులు బిగుసుకున్నాయి.

నీలిచీమ ఇది గ్రహించింది. గండు చీమలవైపు చూస్తూ తెగింపుగా, "ఆగండి..! మీరు పెద్దోళ్ళయితే కావచ్చు. కానీ అన్యాయంగా మా కూడు లాక్కుపోతుంటే మేం చూస్తూ ఊరుకోం. మీ కండల్లో బలముంటే మా కడుపుల్లో ఆకలుంది. మా ఆకలి మంట నిప్పులు చిమ్ముతుంది. ఆ వేడికి మీరంతా కాలి మసై పోతారు. మర్యాదగా ఇక్కణ్నుంచి వెళ్లండి—" అంది.

నీలిచీమ హెచ్చరిక గండుచీమల ఆగ్రహాన్ని విపరీతంగా పెంచేసింది. మరో యోచన లేకుండా అవి శ్రామిక చీమల మీద విరుచుకుపడ్డాయి.

మరో క్షణంలో అదో యుద్ధరంగమైంది. కండబలం పుష్కలంగా వున్న గండు చీమలకూ, తెగింపుతో ముందుకురికిన శ్రామిక చీమలకూ మధ్య భీకర పోరాటం జరిగింది.

కాస్సేపట్లో అక్కడ శవాల గుట్టలు పోగులు పడ్డాయి. పోరాటంలో వందలకొద్దీ శ్రామిక చీమలు చచ్చిపోయాయి. మిగతావి పారిపోయాయి.

గండు చీమలన్నీ విజయగర్వంతో గంతులేశాయి. —"యుద్ధంలో మనమే గెల్చాం. ఈ ఆహారం ఇక మనదే. పదండి లాక్కెళదాం" అన్నాడు నాయకుడు బిగ్గరగా.

** ** **

నాయకుని ఆదేశంతో రొట్టె చుట్టూ వున్న శ్రామిక చీమల మృతదేహాలను తొలగించేశాయి గండుచీమలు.

ఆహారాన్ని తరలించడానికి వ్యూహం తయారైంది. కార్యాచరణకు పూనుకున్నాయన్నీ. గండుచీమల పట్టుకి రొట్టె చిన్నగా కదిలింది.

ఇంతలో—

ఉన్నట్టుండి గాల్లోకి లేచింది రొట్టె. భయంతో కెవ్వున అరిచి చిందరవందరయ్యాయి చీమలన్నీ.

రొట్టెను పాములా చుట్టుకున్న అయిదు వేళ్ళు, ఆ వేళ్ళ తాలూకు చెయ్యి మరింత పైకి లేచి చూస్తుండగానే కనిపించకుండా పోయింది.

కదిలిపోతున్న ఆ మానవ భూతాన్ని కళ్ళ నీళ్ళతో నిస్సహాయంగా చూస్తుండిపోయాయి గండుచీమలు.